

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుం క్యూలైన్లు భక్తులతో నిండుకున్నాయి. - 8లో



డిప్లొమాతో ఉద్యోగ అవకాశాలు

డిప్లొమా కోర్సు చదవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. - 8లో

ఎద్దుల పరుషలో అక్రమాలు

పుంగనూరులోని మతంగడ్డలో ప్రారంభమైన ఎద్దుల పరుషలో కాంట్రాక్టర్ అక్రమాలకు పాల్పడ్డాడు. - 8లో



న్యూస్‌రీల్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్నిరకాల చర్యలు పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి అనుమతుల మేరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి కష్టాలు తగ్గుతున్నట్లు చెప్పారు. బోర్లలో నీటినిల్వలు పెరుగుతున్నాయని తెలిపారు. అప్పటికీ ఎక్కడైనా నీటిఎద్దడి ఉన్నట్లు తమ దృష్టికి వస్తే సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు. జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీ పథకం పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపుతున్నట్లు చెప్పారు. ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.

నేటి నుంచి ఏనుగుల గణన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో గురువారం నుంచి శనివారం వరకు ఏనుగుల గణన పనులు చేపట్టనున్నారు. జిల్లాలోని చిత్తూరు ఈస్ట్, వెస్ట్, క్యారేటినగరం, పలమనేరు, పుంగనూరు, కుప్పం రేంజ్‌ల పరిధిలోని బీట్లలో అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొంటారు. మొత్తం మూడు రోజుల పాటు ఈ పనులు చేయనున్నారు. మొదటిరోజు 15 కిలో మీటర్ల అటవీలో ఏనుగుల అడుగుజాడలు, మలమూత్ర విసర్జన ఆధారంగా వాటి సంఖ్యను లెక్కించనున్నారు. రెండో రోజు 2 కిలో మీటర్లు ఇలాగే పనులు చేస్తారు. మూడు రోజు నీటి కుంటలు, చెరువుల వద్ద ఏనుగులను గమనించి లెక్కిస్తారు. ఆడ మగ, చిన్న, పెద్ద లెక్కన వీటిని గణించి కేంద్ర అటవీశాఖకు నివేదిక పంపనున్నారు. వీటికి సంబంధించి పనులను డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 48 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 15,880 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,632 మంది, మొత్తం 18,512 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచామన్నారు. ఈ క్రమంలోనే ఒకేషనల్‌తో పాటు జనరల్ విభాగానికి చెందిన అన్ని సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో వాల్యుయేషన్ చేసేలా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుందని తెలిపారు.

అర్హుల జాబితా తయారు చేయండి

– జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా విద్యా, వసతి దీవెన పథకాలకు సంబంధించి ఇప్పటి వరకు అప్‌డేట్ కాని విద్యార్థుల ఖాతాలను అప్‌డేట్ చేసి అర్హుల జాబితా తయారు చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గడిచిన త్రైమాసికం వరకు విడుదలైన విద్యా, వసతి దీవెన పథకాల నిధులను కళాశాలలకు చెల్లించని వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. విద్యార్థుల తల్లులకు హెచ్‌డబ్ల్యూవో, ఏఎస్‌డబ్ల్యూఓలు క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నవశకం లాగిన్‌లో విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి 5 స్టెప్స్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి వివరాలను నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని డీడీ ఆదేశించారు.

కౌంటింగ్‌కు అబ్జర్వర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పర్యవేక్షణకు అబ్జర్వర్లను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం జారీ చేసిన ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు ఎంపీ స్థానానికి సంబంధించి చంద్రగిరి నియోజకవర్గంకు కైలాష్ వాంఖడే, నగరికి భరత్ భూషణ్, జీడీ నెల్లూరు/పూతలపట్టుకు అక్‌హౌరి శశాంక్ సిన్హా, చిత్తూరుకు సాధిక్ ఆలం, పలమనేరు/కుప్పంకు మమతను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరు జూన్ 4వ తేదీన ఎస్వీసెట్ కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో చిత్తూరు నడివీధి గంగమ్మ



సంతపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



చిత్తూరు సంతపేటలో ఊరేగుతున్న గంగమ్మ

చల్లగా చూడు.. గంగమ్మ

- చిత్తూరులో వైభవంగా నిమజ్జనోత్సవం
- ఆకట్టుకున్న ఓంశక్తి భక్తుల విన్యాసాలు
- కుప్పంలో అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగింపు
- పోటెత్తిన భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో గంగమ్మ నిమజ్జనోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ఈ నెల 14వ తేదీన జాతర చాటింపు వేశారు. అనంతరం మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చివరిరోజైన బుధవారం సాయంత్రం జాతర పెద్దలు వంశపారంపర్యంగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా నగరంలోని పొన్నియమ్మన్ గుడిలో సారెకు పూజలు నిర్వహించిన జాతర నిర్వాహకులు స్థానిక బజారువీధి వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ప్రతిష్ఠించిన అమ్మవారికి అలంకరింపజేశారు. సాయంత్రం నుంచి రాత్రి గంటల వరకు నగరంలోని ఓంశక్తి భక్తులు స్థానిక ఈశ్వరాలయం నుంచి హైరోడ్డులోని చందన రమేష్ షాపింగ్‌మాల్ వరకు పలు విన్యాసాలు చేసుకుంటూ ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ క్రమంలో భక్తులు తమ నోళ్లకు పదునైన శూలాలను గుచ్చుకుని, వీపులోని నరానికి తాళ్లను కట్టుకుని బస్సులు, లారీలు, కార్లు, ఆటోలను లాగుతూ తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఓ భక్తుడు క్రేన్ సహాయంతో గాలిలో బోర్లాపడుకుని విహరిస్తూ వచ్చి తన నోటి ద్వారా అమ్మవారి మెడలో పూలమాలను ధరింపజేశాడు. సంగీత విభావరి ముగిసిన వెంటనే హైరోడ్డు మీదుగా అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలోని కట్టమంచి చెరువులో నడివీధి గంగమ్మను నిమజ్జనం చేశారు. దీంతో పాటు సంతపేట, కొంగారెడ్డిపల్లి, గిరింపేట, మురకంబట్టు, దొడ్డిపల్లిలో కూడా జలధి కార్యక్రమాలు అత్యంత వైభవంగా ముగిశాయి.





కుప్పం: భక్తులతో కిక్కిరిసిన ఆలయం(ఇన్‌సెట్) అమ్మవారి విశ్వరూప దర్శనం

కిక్కిరిసిన ఆలయం

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం కనుల పండువగా జరిగింది. ఉదయం పట్టణ పురవీధుల్లో శిరస్సును ఊరేగింపు ముగించుకుని అమ్మవారి ఆలయంలో విశ్వరూప దర్శనం ఏర్పాటు చేశారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే జరిగే విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణ వీధులు, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు ఎగబడి దర్శించుకున్నారు. పొంగళ్లు, పిండి వంటలను తయారు చేసిన దీపాలతో అమ్మవారికి చెల్లించారు. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు ఇసుక వేస్తే రాలని జనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారిని వజ్ర కిరీటంతో, బంగారు ఆభరణాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం సాధారణ క్యూలతో పాటు, రెండు వీఐపీ క్యూలు ఏర్పాటు చేయగా, ఆలయ ప్రాంగణంలో భక్తులు కోళ్లు, అమ్మవారికి వస్త్రాలు, పసుపు కుంకుమ, గాజులు, సారె చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎప్పుడూ లేనివిధంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విశ్వరూప దర్శనం కనుల పండువగా జరిగింది. దేవస్థానం



వీపునకు శూలాలు గుచ్చుకుని వేలాడుతూ ఆలయానికి వస్తున్న భక్తుడు



జాతరలో ఆకట్టుకున్న కర్ణాటక డప్పు వాయిద్యాలు

టీడీపీ మూకల విధ్వంసాలపై కుట్రకోణం దాగి ఉందా..? పక్కా ప్లాన్‌తోనే అల్లర్లకు తెగబడ్డారా..? ఓటమి భయంతోనే దాడులకు పాల్పడ్డారా..? పథకం ప్రకారమే చంద్రబాబు సొంత నియోజకవర్గంలో పచ్చముఠా చెలరేగిపోయిందా..? మహిళా వర్సిటీ వద్ద పులివర్తి నాని కావాలనే రెచ్చిపోయారా..? 144 సెక్షన్ అమలులో ఉన్నా వైఎస్సార్‌సీపీ శ్రేణులను కవ్వించేందుకే మారణాయుధాలు చేతపట్టిన గ్యాంగ్‌తో అక్కడకు వచ్చారా..? ఎలాంటి గాయం కాకపోయినా కేవలం సానుభూతి కోసమే నాటకాలాడారా..? ధర్నాలో కూర్చున్నప్పుడు నిక్షేపంగా కనిపించిన నాని.. అంతలోనే ఎందుకు అస్వస్థతకు గురయ్యారు..? సిట్ అధికారులను తప్పుదోవ పటించేందుకే వంటి నిండా కట్టుకట్టించుకున్నారా..? నాటి ఘటనకు సంబంధించిన ఆడియో.. వీడియోలను పరిశీలిస్తే అవుననే అర్థమవుతోంది. పోలింగ్ రోజు.. మరుసటి రోజు దాడుల వెనుక కక్షపూరిత పథకం దాగి ఉందని స్పష్టమవుతోంది.



144 సెక్షన్ నిబంధనలను బేఖాతర్ చేసిన పచ్చమూక (ఫైల్)

- పక్కా పథకం ప్రకారమే కదా దాడులు?
- వాహనం వెళ్లేందుకు అవకాశమున్నా ఆగారు కదా?
- ఆయుధాలు అదే సమయానికి ఎలా వచ్చాయి?
- ముట్టుకోవద్దు.. ఆధారాలు చెరిగిపోతాయని ఎందుకన్నారు?
- ఇనుపరాడ్‌తో కొట్టినా పోలీసులు ఎందుకు ఫిర్యాదు చేయలేదు?
- పచ్చమూక విధ్వంసకాండపై పలు అనుమానాలు

పులివర్తి నానీ.. ఈ ప్రశ్నలకు బదులేది?

సాక్షి టాస్క్‌ఫోర్స్ : శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీ వద్ద జరిగిన విధ్వంస కాండలో టీడీపీ నేతలు, పోలీసుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలింగ్ రోజు నుంచి మరుసటి రోజు వరకు జరిగిన దాడుల వెనుక కుట్ర కోణం దాగి ఉందని విచారణ అధికారులు సైతం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆడియోలు, వీడియోలు పరిశీలిస్తే మొత్తం ఘటనలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, అనుచరులు, గన్‌మన్, మరో నలుగురు పోలీసుల పాత్ర ఉన్నట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా చంద్రబాబు సొంత నియోజక వర్గంలోనే ఈ విధ్వంసాలు చోటు చేసుకోవటం వెనుక టీడీపీ నేతలు, కొందరు పోలీసు అధికారుల హస్తం ఉన్నట్లు సిట్ అధికారులు తన నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. పోలింగ్ రోజున రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాలువ, చంద్రగిరి మండలం కాశిపెంట్ల, చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె పరిధిలోని కందులవారిపల్లె, పాకాల మండలం ఆదినపల్లె పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ నేతలు దాడులకు తెగబడిన విషయం విదితమే. అదే రోజు రాత్రి రామిరెడ్డిపల్లెలో సర్పంచ్ ఇంటిని పచ్చగూండాలు తగులబెట్టారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి కారుకి నిప్పుపెట్టారు. మరో కారుని ధ్వంసం చేశారు. అంతటితో ఆగని టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, అనుచరులు ఈవీఎంలను భద్రపరచిన మహిళా యూనివర్సిటీ వద్ద మరింతగా రెచ్చిపోయారు. ఈ విధ్వంసం అంతా పక్కా ప్లాన్ అనడానికి వెలుగులోకి వచ్చిన వీడియోలు, ఆడియోలే నిలువెత్తు సాక్ష్యం.

అందుకే కెమెరాలు అమర్చుకున్నారా?

దాడులన్నీ ముందస్తు ప్రణాళికలో భాగమేనని తెలుస్తోంది. కొటాలలో జరిగిన ఘర్షణలకు ముందే పులివర్తి నాని, అనుచరుల వాహనాలకు కెమెరాల అమర్చుకొని విధ్వంసాలకు తెగబడినట్లు సమాచారం. దాడుల తర్వాత రోడ్డుపై పడి ఉన్న బీరు బాటిళ్ల, రాళ్లు, రాడ్లు తీసేసేందుకు కొందరు ప్రయత్నిస్తుంటే.. పులివర్తి నాని గన్‌మన్ కల్పించుకుని 'వాటిని తాకొద్దు. అవి ఎవిడెన్స్' అంటున్నాడే తప్ప వీఐపీ ఎక్కడున్నాడో అతని వద్దకెళ్దామనే ఆలోచన కూడా చేయలేదని తెలుస్తోంది. గన్‌మన్‌కి ఎవిడెన్స్‌తో పనేంటి? పోలీసులు చూసుకుంటారు కదా? ఇదిలా ఉంటే.. వీఐపీ మీద దాడి జరుగుతుందని తెలిసిన వెంటనే స్థానిక డీఎస్పీ లేదా సీఐకి సమాచారం ఇవ్వాలి. ఇది చెయ్యకుండా.. సాక్ష్యాలు అంటూ వాటి కోసం కెమెరాలు ఏర్పాటు చేసుకుని, వస్తువులను తాకొద్దని మాట్లాడడం వెనుక అంతర్యం ఏమిటి? దాడి జరిగిందన్నారు, ఆ తర్వాత ధర్నాకు కూర్చున్నారు. ఆ సమయంలో చేతులు, కాళ్లు బాగానే ఉన్నాయి. సుమారు రెండు గంటల తర్వాత గాయాలైనట్టు ఆస్పత్రిలో చేర్చారు. చేతికి, కాలికి కట్లు కట్టుకున్నారు బాగానే ఉంది. రెండు రోజులకే గాయాలు నయమైపోయాయా? సాక్షి పత్రికలో ఫొటోలతో ప్రచురించాక.. మళ్లీ చేతికి, కాలికి కట్లు కనిపించాయి. ఆ కట్లతోనే సిట్ అధికారులకు వినతి పత్రం ఎలా ఇచ్చారు నాని అన్నయ్య గారూ? విధ్వంసాల వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గుతేల్చి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

దాడికి ప్రతి దాడి ఏ చట్టం చెప్పింది?

మహిళా యూనివర్సిటీ వద్ద టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై వైఎస్సార్‌సీపీ నాయకులు దాడులు చేశారని ప్రధాన ఆరోపణ. ఆ దాడిలో తన చేయి, కాలికి తీవ్ర గాయం అయినట్లు ఆస్పత్రిలో చేరి కట్లు కట్టుకుని నానా హంగామా చేసిన విషయం తెలిసిందే. అయితే నానిపై దాడి జరగలేదు.. ఆయన చేయి, కాలికి ఎలాంటి గాయాలు కాలేదు అనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. ఇదంతా పులివర్తి నాని, కొందరు పోలీసులు పథకం ప్రకారం చేసిన అరాచకమని ఆడియో, వీడియో రికార్డుల ద్వారా స్పష్టమవుతోంది. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నా అంత మంది రాడ్లు, బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లతో అక్కడికి చేరుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారు మహిళా యూనివర్సిటీ వద్ద ఉన్నట్లుండి ఆగింది. కారు వెనుక గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కారుపై దాడి చేసే సమయంలో పులివర్తి నానిని గన్‌మన్ సురక్షితమైన ప్రాంతానికి తీసుకెళ్లమని డ్రైవర్‌కి ఆదేశాలు ఇవ్వాలి. వీఐపీని కాపాడుతూ.. తనను తాను కాపాడుకోవాల్సిన బాధ్యత గన్‌మన్ తక్షణ కర్తవ్యం. అలా కాకుండా వాహనాన్ని ఎందుకు ఆపారు? దాడి జరిగే సమయంలో గన్‌మన్ ఎందుకు కారు ఎందుకు దిగాల్సి వచ్చింది? అపాయాన్ని పసిగట్టిన గన్‌మన్ వెంటనే పులివర్తి నానిని అక్కడి నుంచి సురక్షితమైన ప్రాంతానికి తరలించాలి. అయితే అక్కడ కారు ఆపి ఎందుకు ప్రతిదాడికి దిగాల్సి వచ్చింది? ముందు గన్‌మన్, తర్వాత పులివర్తి నాని కారు దిగి పరుగెత్తడం వీడియోల్లో కనిపించింది. దాడి జరిగే సమయంలో అక్కడి నుంచి సురక్షితమైన ప్రాంతానికి వెళ్లేందుకు ఎటువంటి ఆటంకాలు లేవు. నాని కారు దిగి అటువైపు వెళ్లిన కొద్దిసేపటికే తుపాకీ కాల్పుల మోత వినిపించింది. ఈ క్రమంలోనే తుపాకీతో పులివర్తి నాని కాల్చారు అనటానికి ఆడియో రికార్డు ఒకటి బయటపడింది. నాని అనుచరుడా? గన్‌మన్ ? ఇద్దరిలో ఒకరు వేరొకరికి ఫోన్‌చేసి 'ఇక్కడ గొడవ జరుగుతోంది. అన్న ఫైర్ చేశాడు. వెంటనే అందరూ రండి' అని పిలుపు నివ్వడం ఆడియోలో వినిపించింది. తుపాకీ ఫైర్ అయిన సమయంలో గన్‌మన్ వేలికి గాయమైనట్లు తెలుస్తోంది. పులివర్తి నాని తుపాకీ పేల్చలేదు అనుకుంటే.. వేలికి గాయమైన గన్‌మన్ ఎలా ట్రిగర్ నొక్కి గాల్లోకి కాల్పులు జరుపుతారు? వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి అటాక్ చేయించుకునే విధంగా వ్యవహరించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



వైఎస్సార్‌సీపీ నేత కారును ధ్వంసం చేస్తున్న టీడీపీ గూండా



పచ్చమురా దాడిలో ధ్వంసమైన పోలీస్ వాహనం (ఫైల్)



దాడి అనంతరం ధర్నాలో నిక్షేపంగా పులివర్తి నాని(ఫైల్)



ఇనుప రాడ్లతో పచ్చ రౌడీల వీరంగం (ఫైల్)

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు
- సమన్వయశాఖలు పకడ్బందీగా విధులు నిర్వహించాలి
- డీఆర్ఓ పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ పుల్లయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబడుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 7442, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,577 మొత్తం 10,019 మంది 31 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాస్తారన్నారు. పదో తరగతిలో 2059 మంది విద్యార్థులు 15 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విచ్చేసే విద్యార్థులకు సకాలంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో నిరంతరంగా విద్యుత్ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ ఆరీఫుల్లా, డీవీఈఓ సయ్యద్‌మౌలా, డీఈఓ దేవరాజు, ఇతర శాఖలకు చెందిన అధికారులు శిరీష, కేశవులు, మొగలీశ్వర్, భాస్కర్, దయానందరాజు, హేమలత, కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బుధవారం భక్తజనంతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా భక్తులతో ఆలయం రద్దీగా కనిపించింది. ఉచిత దర్శన క్యూలైన్లు నిండుకున్నాయి. ఆలయ అధికారులు భక్తుల రద్దీ దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకున్నారు. మరో పది రోజుల పాటు ఆలయానికి రద్దీ ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

బస్సు- కారు ఢీ



పూతలపట్టు: ముందు వెళ్తున్న బస్సును ఓ కారు ఢీకొన్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఏపీ04ఏఎఫ్3456 నంబరు గల కారు కడప నుంచి తిరువణ్ణామలైకి వెళ్తుండగా మార్గమధ్యలో మండలంలోని తేనేపల్లి టోల్‌ప్లాజా వద్ద ముందు వెళ్తున్న పీలేరు–చిత్తూరు ఆర్టీసీ బస్సును వేగంగా వెళ్లి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జవ్వగా, బస్సు వెనుక భాగం దెబ్బతింది. కారులోని ముగ్గురు స్వల్పంగా గాయపడగా. రంగంపేట క్రాస్‌లోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నారు.

సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దొంగలు

నాగలాపురం: ఓ యువకుడు సెల్‌ఫోన్ చూస్తుండగా బైక్‌లో వచ్చిన ఆగంతకులు లాక్కెళ్లిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. స్థానిక మసీదు పక్కన ఉండే హమీదుల్లా మంగళవారం రాత్రి 11.30 గంటలకు తన ఇంటి ముందు రోడ్డు పక్కన నిలబడి మొబైల్ చూస్తుండగా ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైకు మీద వచ్చి తన చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొని పారిపోయారు. ఈ దృశ్యాలన్ని సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. బైకు మీద వచ్చిన ఆగంతకులు ముఖానికి మాస్కులు ధరించి వచ్చినట్లు బాధితుడు చెప్పాడు. అతని ఫిర్యాదు మేరకు ఎస్సై ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీజీతో టీబీకి చెక్

రాష్ట్రప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. కరోనా మహమ్మారి నియంత్రణలో యుద్ధం చేసింది. అదే మాదిరిగానే టీబీ కట్టడికి సంకల్పించింది. నివారణే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీ నివారణ సాధ్యమని భావించింది. నిర్ణీత సమయంలో వందశాతం వ్యాక్సిన్ పూర్తి చేయాలని జిల్లా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

- టీబీ నివారణకు రాష్ట్రప్రభుత్వం పటిష్ట చర్యలు
- బీసీజీ టీకాకు శ్రీకారం
- గత ఐదు నెలల పాటు పకడ్బందీగా సర్వే
- వ్యాక్సిన్‌కు 2,84,536 మంది గుర్తింపు
- ప్రతి గురువారం టీకా వేసేలా చర్యలు
- తొలివారం 19304 మందికి టీకా
- వందశాతం పూర్తియే లక్ష్యంగా అధికారులు

కాణిపాకం: క్షయ నివారణకు రాష్ట్రప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేయగా, ఇప్పుడు బీసీజీ టీకా వేసి వ్యాధి నియంత్రణకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా క్షయ వ్యాధి ప్రాణం మీదకు తెస్తుంది. ఈ వ్యాధికి కళ్లెం వేసేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం టీబీ యూనిట్లను తీసుకొచ్చింది. దీంతో జిల్లావ్యాప్తంగా వేగవంతంగా సర్వే చేపట్టింది. వ్యాక్సిన్‌కు అర్హులుగా 2,84,536 మందిని గుర్తించింది. జిల్లాలో క్షయ నివారణ శాఖ కింద 9 టీబీ సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతి గురువారం వ్యాక్సినేషన్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. తొలి విడతగా 19304 మందికి టీకా అందించింది. వీటి కింద 1,300 మంది టీబీ బాధితులు ఉన్నారు. ఈ బాధితులకు సెంటర్లలో గళ్ల, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారు. ప్రతినెల రూ.500 ఆర్థికసాయం అందిస్తారు. దీంతో పాటు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. తీవ్ర సమస్యలు ఉంటే ఆరు నెలల పాటు వైద్యసేవలు అందిస్తూ లక్షలాది రూపాయలు విలువ చేసే మందులు, మాత్రలు ఇస్తున్నారు. 2025కి టీబీన్ని పూర్తిగా కట్టడి చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. ఇందులో భాగంగా టీబీకి బీసీజీ వ్యాక్సిన్‌ను అమలులోకి తీసుకొచ్చింది.



బీసీజీ టీకా వేస్తున్న అధికారులు (ఫైల్)

టీబీ లక్షణాలు..

- రెండు వారాలకు మించి దగ్గు
- ఔషధాలు వాడినా పక్షంలో రోజుల పాటు తగ్గని జ్వరం
- రెండు వారాలకు మించి జ్వరం
- కళ్లలో రక్తం పడడం, శరీర బరువు కోల్పోవడం
- ఛాతీ ఎక్స్‌రేలో మార్పు
- ఆకలి మందగించి క్రమేపీ బరువు తగ్గడం

ఇంటింటా సర్వేలో..

జిల్లాలో పెద్దలకు ఉచితంగా బీసీజీ వ్యాక్సినేషన్ అందించేందుకు అవసరమైన కార్యాచరణను ప్రభుత్వం చురుగ్గా పూర్తి చేసింది. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, శాఖ సిబ్బంది కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వే చేపట్టారు. వ్యాక్సిన్ వేసేందుకు అర్హులుగా బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవారు, మద్యం తాగేవారు, ఇప్పుడు పొగతాగుతున్న వారు, గతంలో పొగతాగిన వారు, క్షయ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్న వారు, గత ఐదేళ్లుగా క్షయ వ్యాధిగ్రస్తుల ఇంట్లోని ఇతర కుటుంబ సభ్యులకు, 60 ఏళ్లు పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులను గుర్తించారు. ఇలా 2,84,536 మందిని ఉన్నట్లు నిర్ధారించారు. ప్రతి గురువారం వీరికి టీకా వేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తొలి విడతగా గత గురువారం 575 విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, 7 అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయ భవనాల్లో వ్యాక్సిన్‌ను ప్రారంభించారు. 19,304 మందికి వ్యాక్సినేషన్ వేశారు. ఇందులో 60 ఏళ్లు పైబడిన వారు 8335 మంది మధుమేహం ఉన్నవారు 5100, గతంలో టీబీతో బాధపడిన వారు 360, టీబీతో సన్నిహితంగా ఉంటున్నవారు 2407, ధూమపానం చేసేవారు 2195, ఇతర వ్యక్తులు 907 మంది వ్యాక్సినేషన్ వేసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఫలితంగా జిల్లాలో టీబీని అదుపు చేయగలమని ప్రభుత్వం భావిస్తోంది. ఓ పక్క టీబీ బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తూ.. మరోవైపు యుద్ధప్రాతిపదికన టీబీ నివారణకు టీకాలు వేస్తోంది. ఈ ప్రక్రియ ఫలిస్తే, 2025 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

వ్యాధి కట్టడికి లక్ష్యంగా..



క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా తొలిసారిగా 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి దశలో 9 వేల మందికిపైగా బీసీజీ టీకాలు వేశాం. ఈ వ్యాక్సిన్ ప్రతి గురువారం హెల్త్ సెంటర్లల్లో వేస్తారు. సర్వేలో గుర్తించిన వారంతా విధిగా ఈ వ్యాక్సిన్‌ను వేసుకోవాలి. జిల్లాను క్షయ రహితంగా చేయడమే లక్ష్యం.

– వెంకటప్రసాద్, జిల్లా క్షయ నివారణ అధికారి, చిత్తూరు

టీకానే శ్రీరామరక్ష..



ఇతరత్రా కారణాలతో చాలా మందిలో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ప్రధానంగా టీబీ వేగంగా సంక్రమిస్తుంది. వీటి నుంచి బీసీజీ వ్యాక్సిన్ ప్రజలకు శ్రీరామరక్ష. పుట్టిన బిడ్డకు బీసీజీ టీకా ఇస్తున్నారు. అదేవిధంగా ఇప్పుడు పెద్దలకు కూడా ఇస్తున్నారు. ఈ టీకాను తప్పనిసరి చేస్తే సంక్రమణను తగ్గించే అవకాశాలు ఉన్నాయి.

– రవిరాజు, డీఐఓ, చిత్తూరు

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరదయ్యపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వరదయ్యపాళెం: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలోని నివాసంలో మంత్రి పెద్దిరెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, వరదయ్యపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాజేష విజయానికి పార్టీ నేతలు, కార్యకర్తల కృషి అభినందనీయమన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాజేష్ కూడా అందుకు అనుగుణంగానే పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో ఛైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, నాయకులు చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, పాల సుబ్రమణ్యంరెడ్డి, వినోద్ యాదవ్, దుద్దు వేణు, మాధవయ్య, శేఖర్, మహేంద్ర, శోభన్ యాదవ్, ప్రభాకర్, మునస్వామి యాదవ్ పాల్గొన్నారు.

ఎద్దుల పరుషలో అక్రమాలు

- చేతివాటం చూపిన పరు కాంట్రాక్టర్
- లబోదిబోమన్న రైతులు, వ్యాపారులు

పుంగనూరు: పట్టణంలోని మతంగడ్డలో ప్రారంభమైన శ్రీమాణిక్య వరదరాజస్వామి ఎద్దుల పరుషలో బుధవారం పలు అక్రమాలు చోటు చేసుకోవడంతో రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరుష ఏటా నాలుగు వారాలు నిర్వహిస్తారు. అయితే పరుష కాంట్రాక్టర్ రెడ్డెప్ప ఒక్కో పశువుకు రూ.25 టికెట్ ఉండగా అక్రమంగా రూ.50 వసూలు చేశాడు. అలాగే ఆవులను లారీల్లో బయట ప్రాంతాలకు తరలించే పశువుల సెస్‌ను మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల్లో వసూలు చేస్తుంది. కానీ కాంట్రాక్టర్ నకిలీ రశీదులు తయారు చేసి ఒక్కో ఆవుకు రూ.200 చొప్పున లారీకి రూ.2 వేలు వసూలు చేసి పంపడం వివాదాస్పదమైంది. తొలి రోజే లక్షలాది రూపాయలు స్వాహా చేయడంతో రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మార్కెట్ కమిటీ సెక్రటరీ గోపీని వివరణ కోరగా సెస్‌ను మార్కెట్ కమిటీ వారు మాత్రమే వసూలు చేయాలని, ఈ నకిలీ రశీదుల విషయమై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే దేవదాయశాఖ ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం మాట్లాడుతూ పరుషలో ఎలాంటి అక్రమాలు జరగకుండా గురువారం నుంచి చూసుకుంటామని, కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన వెంగమాంబ

- శతావధాని ఆముదాల మురళి
- ముగిసిన తరిగొండ వెంగమాంబ జయంత్యుత్సవాలు

తిరుపతి కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సామాన్యులు సైతం అర్థం చేసుకునే ప్రజాకవిత్వం ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేశారని శతావధాని ఆముదాల మురళి (తిరుపతి) అన్నారు. అన్నమాచార్య కళామందిరంలో తరిగొండ వెంగమాంబ రెండు రోజుల జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ముగింపు రోజు తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై నిర్వహించిన సదస్సుకు అధ్యక్షత వహించిన మురళి మాట్లాడారు. వెంగమాంబ రచనలు నాటి సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ ప్రస్తుత సమాజానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. వెంగమాంబ తన జీవితాన్ని స్వామివారి కైంకర్యానికి అంకితం చేశారని, ఆమె వ్యక్తిగా, సంస్కర్తగా, యోగినిగా, కవయిత్రిగా శ్రీవారి భక్తితత్వాన్ని ప్రచారం చేశారని కీర్తించారు. అనంతరం డాక్టర్ వీఆర్.రాసాని 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ– జీవిత విశేషాలు' అనే అంశంపై ఉపన్యసించారు. వెంగమాంబ బాల్యంలోనే భర్తను కోల్పోయినా వైధవ్యాన్ని అంగీకరించలేదని దీనికి కారణం శ్రీవేంకటేశ్వరస్వామిని తన భర్తగా భావించిందన్నారు. అన్నమయ్య కీర్తనలతో స్వామివారిని ఆరాధించగా, వెంగమాంబ గద్య, పద్యం, యక్షగానాలతో తన భక్తిని చాటుకుందన్నారు. డాక్టర్ కేశవులు 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ–సాహిత్యం, వర్ణనలు' అనే అంశంపై ఉపన్యసించారు. ఆమె వివిధ సాహితీ ప్రక్రియలలో 18 గ్రంథాలను రచించిన మొదటి తెలుగు కవయిత్రి అని కీర్తించారు. ప్రాచీన కవులకు దీటుగా, ప్రబంధాలకు పోటీగా తరిగొండ వెంగమాంబ అష్టాదశ వర్ణనలు చేశారని ఉదాహరణలతో వివరించారు. డాక్టర్ బాలాజీ దీక్షితులు 'తరిగొండ వెంగమాంబ– తెలుగు సాహిత్య సౌరభం' అనే అంశంపై ఉపన్యసించారు. ఆమె ఆంజనేయస్వామి గురించి తపస్సు చేసిన అటవీ మార్గం యోగ సాధన రహస్యాలు తెలిపే మార్గమన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు భక్తి సంకీర్తనలు ఆలపించారు.



అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులో మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి



వెంగమాంబకు నివాళులర్పిస్తున్న టీటీడీ వెంగమాంబ ప్రాజెక్టు సంచాలకులు భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

వెంగమాంబకు పుష్పాంజలి

తిరుమల: 18వ శతాబ్దపు శ్రీ వేంకటేశ్వర స్వామివారి పరమ భక్తుల్లో ఒకరైన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతిని తిరుమలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో బుధవారం సాయంత్రం టీటీడీ వెంగమాంబ ప్రాజెక్టు సంచాలకులు భూమన్ సుబ్రమణ్యం రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ వెంగమాంబ వేంకటేశ్వరుడు, తరిగొండ లక్ష్మీ నృసింహస్వామిపై గొప్ప రచనలు చేశారని అన్నారు. వెంగమాంబ ప్రాజెక్టు ద్వారా టీటీడీ ఆమె సాహిత్యాన్ని ప్రచారం చేస్తూ, ప్రతి ఏటా తరిగొండ, తిరుపతి, తిరుమలలో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని చెప్పారు. శ్రీవారికి ఏకాంతసేవ సమయంలో అన్నమయ్య లాలి – వెంగమాంబ ముత్యాలహారతి ఇప్పటికీ కొనసాగుతున్నాయని వివరించారు. అంతకు ముందు నాద నీరాజనం వేదికపై టీటీడీ ఆస్థాన విద్వాంసులు డాక్టర్ బాలకృష్ణ ప్రసాద్‌తో పాటు ప్రముఖ అన్నమాచార్య ప్రాజెక్టు గాయని శ్రీమతి బుల్లెమ్మ వెంగమాంబ రచించిన కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, వెంగమాంబ వంశీయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తికి ప్రతీక.. వెంగమాంబ
శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

తిరుమల : మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ స్త్రీ శక్తికి, సాధికారతకు ప్రతీకని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామిస్వామీజీ తెలిపారు. బుధవారం తిరుమలలో నిర్వహించిన వెంగమాంబ జయంతి ఉత్సవాల్లో స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో చాలా కష్టాలు అనుభవించి పరమాత్ముని దర్శిస్తూ ఆమె జ్ఞానమూర్తిగా అవతరించారని వెల్లడించారు. వెంగమాంబ రచనలను సాక్షాత్తు శ్రీవారు అంగీకరించినట్టు చెప్పారు. వెంగమాంబ రచించిన వేంకటాచల మహత్యం అత్యంత పవిత్రమైందని తెలిపారు. 87 ఏళ్ల వయసులో శ్రీవారి ఆమోదంతో వెంగమాంబ సజీవ సమాధి అయ్యారని వివరించారు. ఈ క్రమంలోనే స్వామీజీ వెంగమాంబ సంకీర్తనల రెండు పుస్తకాలు, సీడీ విడుదల చేశారు.

శాస్త్రోక్తంగా శ్రీ నృసింహ పూజ

తిరుమల: వైశాఖ మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ నృసింహ జయంతిని పురస్కరించుకుని తిరుమల వసంత మండపంలో బుధవారం శ్రీ నృసింహ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుండి 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఇందుకోసం శ్రీవారిని నృసింహస్వామి అలంకారంలో సింహ వాహనంపై కొలువుదీర్చారు. సుదర్శన చక్రం, నరసింహుని ప్రతిమ ను ఏర్పాటు చేశారు. అభిముఖంగా నరసింహస్వామి ప్రతిమలను ఆశీనులను చేశారు. శ్రీ నృసింహ మంత్రాన్ని 108 సార్లు, నృసింహ అష్టోత్తర శతనామావళి, సుదర్శన మంత్రాన్ని 24 సార్లు పారాయణం చేశారు. కార్యక్రమంలో శ్రీవా రి ఆలయ అర్చకులు, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో..

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం నృసింహ జయంతి నిర్వహించారు. శ్రీ యోగనరసింహస్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు.



నృసింహ స్వామికి హారతిస్తున్న అర్చకులు

తాత్కాలికంగా టపాసుల గోడౌన్ మూత

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని టపాసుల గోడౌన్‌లను బుధవారం రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా మూసివేయించారు. నగరంలోని నాలుగు గోడౌన్‌లకు అధికారులు సీల్ వేశారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు టపాసుల గోడౌన్‌లను బంద్ చేస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పెట్రోల్ బంక్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బాటిళ్లు, ఇతరత్రా వాటిల్లోకి పెట్రోల్ పట్టకూడదని సూచించారు. సమావేశంలో డీటీ కిరణ్ ఉన్నారు.



టపాసుల గోడౌన్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

డిప్లొమాతో ఉద్యోగ అవకాశాలు

- ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ రవీంద్రబాబు

పుత్తూరు: డిప్లొమా కోర్సు చదవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూడీసీ) ఈఈ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ డిప్లొమా పూర్తి చేయడం ద్వారా ఇంజినీరింగ్ రంగంలో మెరుగ్గా రాణించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో కూడా క్యాంపస్ సెలక్షన్స్ ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ మాట్లాడుతూ ఈ అకడమిక్ ఇయర్‌లో వివిధ పెద్ద కంపెనీల ద్వారా నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో తమ కళాశాల నుంచి 62 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం రవీంద్రబాబు చేతుల మీదుగా విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూడీసీ డీఈ బాలసుబ్రమణ్యం, కళాశాల విభాగాధిపతులు కిషోర్‌కుమార్, వేలాయుధాచారి, రామకృష్ణరావు, సుగుణ, జయచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో అధికారులు